క్లుప్తంగా

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: సంక్రాంతి సెలవుల నేపథ్యంలో తరగతులు నిర్వహించే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు ఈనెల 9 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, దానికి అనుగుణంగానే కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవులను ప్రకటించాలన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, హర్ష కుమార్, నిహాల్, భగత్, అభి, వినోద్, గురు, బాబా ఫక్రుద్దీన్, హేమంత్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

లేపాక్షి: మండలంలోని కొండూరు శివారులో పేకాట స్థావరంపై ఎస్‌ఐ గోపీ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,250 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారందరిపై కేసు నమోదు చేశామన్నారు.

రొళ్లలో...

రొళ్ల: మండల పరిధిలోని కె.గొల్లహట్టి గ్రామ సమీపంలోని కొండ పరిసర ప్రాంతాల్లో జూద కేంద్రంపై ఆదివారం సాయంత్రం దాడి చేసినట్లు ఎస్‌ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఆరుగురు జూదరులతో పాటు రూ.5,500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు


చెల్లాచెదురుగా పడిన ద్విచక్ర వాహనాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గొడనహళ్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకెళితే.. వెంకటాపురం నుంచి గణేష్ ద్విచక్ర వాహనంలో మడకశిర వైపు వస్తున్నారు. అలాగే హరేసముద్రంకు చెందిన రాజు ద్విచక్ర వాహనంలో మడకశిరపై నుంచి అటు వైపు వెళుతున్నాడు. మార్గ మధ్యలో గొడనహళ్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన గణేష్, రాజులను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం

పెనుకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో సోమవారం ఎమ్మెల్యే శంకరనారాయణ, మంత్రి ఉషశ్రీచరణ్ నియోజకవర్గ పార్టీ ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడంపై చర్చించనున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, మద్యం

గోరంట్ల: బెంగళూరు నుంచి కర్నూలు జిల్లాకు అక్రమంగా మద్యం తరలిస్తున్న తలారి రంగస్వామి అనే వ్యక్తిని పాలసముద్రం జాతీయ రహదారిపై ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. అతని వద్ద నుంచి 2,400 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కారు (ఏపీ26ఏజే004)ను సీజ్ చేశామన్నారు.

తిరుమలకు పాదయాత్ర


రొద్దం నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న భక్తులు

రొద్దం: మండల కేంద్రం నుంచి తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పాదయాత్రగా తరలివెళ్లారు. ఉదయం పెద్దాంజనేయస్వామి దేవాలయం వద్ద అర్చకులు గిరీష్‌స్వామి ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం శ్రీరామ భక్తమండలి ఆధ్వర్యంలో పలువురు భక్తులు తిరుమలకు పాదయాత్రగా తరలివెళ్లారు. దాదాపు 300 కిలోమీటర్ల కాలినడకన వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటామన్నారు.

త్వరలో పురం వాసుల కల సాకారం

- రైల్వే రోడ్డు పునరుద్ధరణ పనులపై అధికారుల దృష్టి
- భవనాల తొలగింపు పనులు దాదాపుగా పూర్తి
- రోడ్డుకు ఇరువైపులా కాల్వల నిర్మాణం


రైల్వేరోడ్డు విస్తరణ పనుల కోసం తొలగించిన దుకాణాలు, భవనాలు


పూర్తయిన డ్రైనేజీ

హిందూపురం: పట్టణ వాసుల కల త్వరలోనే సాకారం కానుంది. పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వేరోడ్డు పూర్తిస్థాయిలో విస్తరించి సుందరీకరణ పూర్తిచేసి మోడల్ రహదారిగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగానే మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం పనులు ప్రారంభించారు.

టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

సుమారు 35 ఏళ్ల కాలం నుంచి పాలన సాగిస్తున్న టీడీపీ పాలకులు ప్రతి ఎన్నికల్లో రైల్వేరోడ్డు, రింగు రోడ్డు అంటూ హామీలు గుప్పిస్తూ వచ్చారేగానీ కనీసం ప్రతిపాదన కూడా చేయలేకపోయారు. పట్టణ ప్రధాన రైల్వేరోడ్డు విస్తరణ కోసం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ ఆధ్వర్యంలో మొదటి ప్రాధాన్యతగా రైల్వే రోడ్డును నిర్మించాలని తీర్మానించడంతో పాటు రైల్వే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కౌన్సిల్ తీర్మానం కూడా చేశారు. ఈ రహదారిని మోడల్‌రోడ్డుగా నిర్మించి ఇరుపక్కలా కాలువలు, మధ్యన డివైడర్లు, సెంటర్ లైటింగ్‌తో సుందరంగా నిర్మించబోతున్నారు.

రూ.లక్షకు నాలుగు లక్షలు

రైల్వేరోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు ఇరుపక్కలా ఉన్న పెద్ద భవనాలు చాలా వరకు రోడ్డు ముందు భాగాలను యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. భవన యాజమానులు అంగీకరించి పత్రాలు సమర్పించి భవనాలు తొలగింపు ఖర్చుతో పాటు నష్టపరిహారంగా రూ.లక్షకు నాలుగింతలు రెట్టింపుతో (రూ.లక్షకు నాలుగు లక్షలు) టీటీఆర్ పత్రాలు పొందారు. ఇప్పటికే సుమారు 90 శాతం తొలగింపులు పూర్తయ్యాయి. ఎస్‌బీఐ సర్కిల్ వారు అంగీకరం తెలిపారని పత్రాలు ఇస్తే పనులు వేగం అవుతాయని అధికారులు చెబుతున్నారు. అంగీకరించకపోయినా భూసేకరణ నిబంధనల మేర ప్రజా అవసరాలకు ప్రభుత్వం స్థలాలను స్వాధీనం చేసుకోనే అధికారంతో తొలగించి రోడ్డు నిర్మాణాలు సాగుతాయని అంటున్నారు.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



హిందూపురం ప్రజల చిరకాల వాంఛ రైల్వే రోడ్డు విస్తరణ. రోడ్డు విస్తరించి సుందీకరణతో పనులు చేపట్టడానికి పనులు అతిత్వరలో ప్రారంభించబోతున్నాము. ఇప్పటికే అన్నిరకాల ప్లానింగ్ గ్రాఫిక్ పనులు పూర్తయ్యాయి. అలాగే రూ.86 లక్షల నిధులతో రోడ్డుకు ఇరువైపులా కాలువ నిర్మాణ పనులు మొదలయ్యాయి. అంచనలతో కూడిన అన్ని ప్రతిపాదనలు సిద్ధంచేసి ఈఎన్‌సీ పంపించడం జరిగింది. టెండర్ కూడా పిలవడం జరిగింది. టెండర్ ప్రక్రియ మరో 15 రోజుల్లో పూర్తికానుంది. టెండర్ ఖరారు అయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. త్వరతగతిన పూర్తిచేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం.

\- ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం


గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్.దీపిక

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసి ఇంటి ముంగిటకే సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. ఆదివారం హిందూపురం మండలంలోని పూలకుంట గ్రామంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు వలంటీర్లతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. రైతుల కోసం ప్రతి పంచాయతీలో వ్యవసాయ కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు వ్యవసాయ మందులు ఇలా అన్నిరకాలుగా రైతు ముంగిటకే అందిస్తున్నారని చెప్పారు. గతంలో వీటి కోసం పట్టణానికి వచ్చి పడిగాపులు కాయాల్సి వచ్చేందన్నారు. ఎన్నోసంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల వెన్నంటే నేనున్నాని నిలిచిన జగనన్నకు బాసట నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ఎన్నికలప్పుడే 'పురం' గుర్తుకువచ్చేది

ఎమ్మెల్యే బాలకృష్ణకు ఎన్నికలు రాగానే హిందూపురం గుర్తుకు వస్తాయని దీపిక విమర్శించారు. సినిమా డైలాగులతో హిందూపురాన్ని భాగ్యనగరంగా మార్చేసా అంటూ అరచేతిలో వైకుంఠం చూపి ఆ తర్వాత కనిపించకుండా పోతారన్నారన్నారు. ఇంకా ఎవరోవస్తారు ఏమో చేస్తారని ఎదురుచూసేబదులు మన ఊరిని మనమే అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రాచపల్లి మహేందర్‌నాథ్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నంజరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, హనుమంతప్ప, ఇలియాజ్, అమానుల్లా, ఫయాజ్, హఫీజ్, బాబావలి, నిజాం, బాబా జాన్, రమేష్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డిని కలిసిన పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో హిందూపురం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తామని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని చౌళూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుమతిరెడ్డిని ఆమె స్వగృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా దివంగత చౌళూరు రామకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో శాంతమ్మ సమావేశమయ్యారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు గెలిపించి జగనన్నకు బహుమతిగా అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, రామాంజి, ఎంపీటీసీ కృష్ణవేణి, సర్పంచ్ నంజప్ప, శివప్రసాద్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నిసార్, శ్రీనివాసులు, నర్సా, సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మేళాపురంలోని దీప్తి పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, పాఠశాల కరస్పాండెంట్ అబ్రహం కుట్టి యాంకల్, జేవీవీ జిల్లా కార్యదర్శి ఆదిశేషు, రామకృష్ణ, ఈటీ రామ్మూర్తి పాల్గొని మాట్లాడారు.

జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్ విజేతలు

జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ధర్మవరంలోని బీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈశ్వర్, ఓబులేషు, నగేష్‌కుమార్ విజేతలుగా నిలిచారు. అలాగే ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఓడీసీలోని రెయిన్ బో హైస్కూల్ విద్యార్థులు యశ్వంత్ నాయుడు, లయశ్రీ, మేఘనాథ్ విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. వారు రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షల్లో పాల్గొంటారన్నారు.

కమనీయం.. రంగనాథుని కల్యాణం


శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

హిందూపురం: పట్టణంలోని కన్యాకపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయ ముఖమండపంలో వేదపండితులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి వార్ల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు.అనంతరం మహిళా మండలి సభ్యులచే విష్ణుసహస్త్ర నామావళితో పఠనం చేశారు. తర్వాత విశేష పూజలు చేసి మంగళ హారతులిచ్చారు. కల్యాణాన్ని తిలగించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

పాఠశాలలు రక్షణ కేంద్రాలుగా ఉండాలి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తిప్పేస్వామి

పావగడ: పాఠశాలలు విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా రక్షణ కేంద్రాలుగా ఉండాలని కర్ణాటక రాజ్య చిన్నారుల హక్కుల రక్షణ మండలి సభ్యుడు డా. కేటీ తిప్పేస్వామి అభిప్రాయపడ్డారు. స్థానిక టీపీఎస్ మీటింగ్ హాలులో నిర్వహించిన విద్య, సాంఘిక, వెనుకబడిన వర్గాల శాఖల అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థుల రక్షణా సమితిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాలూకా వ్యాప్తంగా బడిబయట ఉన్న విద్యార్థులను ఈ నెల 30 లోగా పాఠశాలల్లో చేర్పించాలని బీఈఓ ఇంద్రాణికి సూచించారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం, సీడీపీఓ సునీత, జిల్లా చిన్నారుల రక్షణాధికారి అనూష, సాంఘిక సంక్షేమశాఖ అధికారి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ వెళ్లి పింఛన్ పంపిణీ


యల్లమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ లలిత

మడకశిరరూరల్: మండలంలోని జమ్మానిపల్లికి చెందిన వలంటీర్ లలిత పెనుకొండ తాలుకాలోని ముద్దుపుకుంటకు వెళ్లి ఆదివారం వృద్ధురాలు యల్లమ్మకు రూ.3 వేల పింఛన్ అందజేసింది. జమ్మానిపల్లికి చెందిన యల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ముద్దుపుకుంటలో కుమార్తె ఇంట్లో ఉంది. విషయం తెలుసుకున్న వలంటీర్ లలిత ముద్దుపుకుంట వెళ్లి పింఛన్ అందజేశారు. వృద్ధుల పట్ల ఇంతంటి ప్రేమ చూపిస్తున్న సీఎం వైఎస్ జగనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నామని యల్లమ్మ తెలిపారు.

కర్ణాటక వెళ్లి...

రొద్దం: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు అనారోగ్యంతో కర్ణాటక రాష్ట్రం బాగేపల్లిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ గాయత్రి ఆదివారం కర్ణాటకలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న శ్రీనివాసులుకు పింఛన్ అందజేశారు. దీంతో గాయత్రికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సందడిగా 'కియా' క్రికెట్ పోటీలు



ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న బ్లూ వెల్స్, మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ జట్లు


విజేత మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ జట్టుకు మెగా చెక్కు అందిస్తున్న కియా ప్రతినిధులు

పెనుకొండ రూరల్: కియా సంస్థలో పనిచేసే ఉద్యోగులకు ఆ సంస్థ ఏటా క్రీడా పోటీలను నిర్వహిస్తోంది. ఎప్పుడూ ఒత్తిడితో పనిచేసే ఉద్యోగులకు ఆట విడుపుగా ఉల్లాసంగా ఉండేందుకు క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండు నెలలుగా రోజులుగా పోటీలు జరుగుతున్నాయి. పరిశ్రమలోని అసెంబ్లీ, పెయింట్, బాడీ, ప్రెస్, క్వాలిటీ కంట్రోల్, మెయింటనెన్స్, ప్రొడక్షన్ కంట్రోల్, ఇంజన్ వంటి వివిధ 11 రకాల డిపార్ట్‌మెంట్లకు సంబంధించి 16 టీములు పోటీల్లో పాల్గొన్నాయి. ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లో బ్లూ వెల్స్, మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ తలపడ్డాయి. ఇందులో మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ జట్టు విజేతగా నిలిచింది.

విజేతలకు నగదు బహుమతులు

ట్రోఫీ దక్కించుకున్న మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ జట్టుకు రూ.37,500, ద్వితీయ స్థానంలో నిలిచిన బ్లూ వెల్స్ జట్టుకు రూ.22,500, తర్వాతి స్థానాల్లో నిలిచిన ప్యాన్‌థర్స్‌కు రూ.15 వేలు, రెడ్ బుల్‌కు రూ.7,500 నగదు బహుమతులను కియా యాజమాన్యం అందజేసింది. బహుమతుల ప్రదానోత్సవంలో కియా చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కబ్యాంగ్ లీ మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య సోదర భావం పెంచడంతో పాటు ఉద్యోగుల ఆట విడుపు కోసమే ప్రతి సంవత్సరం క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఉమెన్స్ డే, ఫొటోగ్రఫీ పోటీలు ,యోగా డే, కిన్ ఇండోర్ గేమ్స్, రంగోళి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


పాఠశాల ప్రాంగణంలో గురువులతో పూర్వ విద్యార్థులు

పరిగి: మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. పాఠశాలలో 2010-11 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పాటూ అప్పటి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రావుతో కలిసి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం తమ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ గురువులు రంగయ్య, చిత్తరంజన్, సరళాంభ, ఉమాదేవి, నారాయణస్వామి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

సోమందేపల్లి: అనంతపురంలో ఈ నెల 10న జరగబోయే బీసీపై పార్టీ రాయలసీమ సింహ గర్జన పోస్టర్లను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేష్ యాదవ్ ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్ర, సురేష్, లక్ష్మీకాంత, నరసింహ మూర్తి, పురుషోత్తం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న నగేష్

పావగడ: తాలూకాలోని కే రాంపురంకు చెందిన రాంపురం నాగేశ్ ఉత్తమ ఎస్‌డీఎంసీ (పాఠశాల అభివృద్ధి సమితి) అధ్యక్షుడిగా పురస్కారాన్ని అందుకున్నాడు. బెంగుళూరులోని బసవన గుడి వద్ద ఉన్న నేషనల్ కళాశాలలో కర్ణాటక జ్ఞాన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు నిర్వాహకులు పురస్కారాన్ని అందజేశారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో ఆదివారం హ్యాండ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ సెలెక్షన్లు నిర్వహించారు. అండర్-19 విభాగంలో జిల్లా స్థాయి క్రీడాకారులను ఎంపిక చేశారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి చాలా మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌తో పాటు సీనియర్ రిటైర్డు పీడీ కుమార్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి ముస్తాఫా కమల్ బాషా, పీఈటీలు హేమంతకుమార్, వేదవతి తదితరులు పాల్గొన్నారు.

మహోత్సవాలను విజయవంతం చేయండి

పెనుకొండ: గుంటూరులో ఈనెల 26 నుంచి 29 వరకూ జరిగే బైబిల్ మిషన్ మహోత్సవాలను విజయవంతం చేయాలని పాస్టర్ సుధాకర్ పిలుపు నిచ్చారు. ఆదివారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆయన మాట్లాడారు.

'శివన్న'కు యక్షగాన వారధి బిరుదు


ఉపాధ్యాయుడు శివన్నకు మెమొంటో అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభ జరిగింది. ఇందులో భాగంగానే కళలు, యక్షగానం అనే అంశాలపై మడకశిర పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివన్న ప్రసంగించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆ సంస్థ అధ్యక్షులు బుడి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు డాక్టర్ శివన్నకు తెలుగు, కన్నడ యక్షగాన వారధి అనే బిరుదుతో పాటు మెమొంటో అందించి సత్కరించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీపాళ్యం గ్రామ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర యాదవ్ తెలిపారు.

టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా నరసింహమూర్తి

అమరాపురం: జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా అమరాపురం మండలం హేమావతికి చెందిన బీజేపీ నాయకుడు నరసింహమూర్తిని నియమించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడిగా ఎంపిక చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న రంగవల్లులు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

రొద్దం: మండల కేంద్రంలో టింబక్టువ్-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న చిగురు ఆధ్వర్యంలో ఆదివారం చిన్నపిల్లల అనంతశక్తి సొసైటీ కార్యాలం వద్ద సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు రకరకాల రంగవల్లి వేసి చూపర్లను ఆకట్టుకున్నారు. సాంప్రదాయ ముగ్గులు వేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.